చిత్రంగా... అతి విచిత్రంగా నాకీ బయటి ప్రపంచపు శబ్దాలేవో లీలగా విన్పిస్తున్నాయి. అమ్మ గుండె చప్పుడు అద్భుతంగా వుంది. నా చుట్టూ అమ్మ పొత్తికడుపులోని పేగులు చుట్టి వున్నాయి. చీకటి కుహరంలో వున్నానని పించి అసహనంగా కదిలితే ఒక్కసారి అమ్మ అరచి నట్టుంది...

# అక్రమం



— కె.వి.నరేందర్

అమ్మ మనసు మూలుగు తోంది... ఆక్రోశిస్తోంది!

ప్రతి అరగంట కొకమారు అమ్మ చల్లని చేయి తన పొత్తి కడుపును నిమురుతుంటె... నేను కరిగే వెన్నముద్దనవుతున్నాను.

అమ్మ అలా ప్రేమతో నిమురుతున్నపుడు ఆమె మనసు మాత్రం రోదిస్తోంది. తెరలు తెరలుగా గొంతుదాటి పోతున్న ఆ రోదన వింటుంటె... నా చిన్ని గుండె కూడా బాధి స్తోంది.

అమ్మ గుండె కవాటాలు లయతప్పి కొట్టుకుంటాయి ఒక్కోసారి... నా చుట్టూ వున్న రక్త ప్రసారాలు ఉవ్వెత్తున పొంగి పొర్లుతుంటాయి. హృదయం వూగిసలాడుతుంది. అంతే మళ్ళీ గుండె గదుల్లోంచి కన్నీళ్ల ఖాళీ అవుతాయి.

బయట ఏదో రభస... అమ్మకు కోప మొచ్చినట్టు నాకు అవలీలగా తెల్సిపోతుంది. అప్పుడప్పుడూ ఎవరో వచ్చిన నన్ను శత విధాలా నొక్కి చూస్తున్నారు. ఎవరు?? బయటి ప్రపంచంలో ఎప్పుడు పడతానో?

ఊహూ... ఇప్పుడు పడను!!

మరో వారం రోజులు పట్టవచ్చు... రేపు నర్సింగ్‌హోంలో జాయిన్ చేయించండి" అని బయట ఎవరో అంటూంటే విన్లేదూ...

అప్పట్నించి బయట ఏదో హడావిడి జరుగుతోంది. పట్టణానికి తరలిద్దాం అని మగ గొంతు అరచింది కాసేపు. వద్దండి అంటూ బ్రతిమాలిన ఆడగొంతు. ఎవరో ఆయన తాతయ్య కావచ్చు... ఆమె అమ్మమ్మ కావచ్చు.

అంతా నిశ్శబ్దమైందనుకున్న సమయంలో అమ్మ సన్నగా ఏడ్చింది. అమ్మ కంఠంలో వెక్కిళ్ళు అడ్డుపడి తెరలు తెరలుగా పోతున్న దుఃఖం నాకు స్పష్టంగా కన్పిస్తోంది.

అమ్మ ఎందుకేడుస్తోంది?

నేను రావడం ఇష్టం లేదేమో??

అంతేలే... అంతకు ముందే పుట్టిన అక్కమీదో, అన్నమీదో ప్రేముండి వుంటుంది. హూ... ఇప్పుడేడుస్తుంది. తర్వాత... తనను ప్రేమతో నిమురుతుంది. అమ్మ మనసు ఎప్పుడెలా వుంటుందోనని నేనెప్పుడూ ఆమె హృదయం వైపే చూస్తుండి పోతున్నాను.

అమ్మ గొంతులోంచి అన్నం కూడా దిగి రావట్లేదు. అమ్మ ఎందుకిలా మారి పోతుంది? తిరగటం కూడా లేనట్టుగా వుంది. అమ్మ ఎముకలు నేను లెక్కిస్తున్నాను.

అస్థి పంజరం లోంచి నేనెంత పలికినా ఆమెకు విన్పించదు.

అమ్మను నిన్నరాత్రి పన్నెండు గంటలకు ఎంతో దారుణంగా కదలకుండా మెదల కుండా పడుకోబెట్టారు. నేను కూడా ఎంత అవస్థపడ్డాను ఈ చీకటి గుహలో

"ఈ రోజు చంద్రగ్రహణం... నువ్వు లేవకూడదు" అని బయట ఎవరో అమ్మ మీద మాటిమాటికీ విరుచుకుపడ్డారు.

పాపం అమ్మెంత బాధపడిందో??

కవాటాలు నెమ్మదిగా కొట్టుకుంటూ... అమ్మ గుండె ఎంత చిక్కుకుపోయిందో నాకు కన్పిస్తోంది. ఇదంతా నావల్లనేనా? నాకూ చచ్చిపోవాలనిపిస్తుంది. కాని అమ్మ తన పొత్తి కడుపును నిమిరే సరికి నాకు బ్రతకాలనిపిస్తుంది.

"ఈ రోజు సాయంత్రం మీ నాన్న వస్తాడా కన్నా... అప్పుడు మనమిక్కన్నించి వెళ్లిపోతాం... వూహుకాదు... ఈ రాక్షసుల మధ్య నించి పారిపోతాం" అని నన్ను అమ్మ తనమీద చెయ్యేసి ఎంత ప్రేమగా చెప్పింది.

ఇలా రోజూ అంటూనే వుంది... నాన్న క్యాంపు కెళ్లిపోయాడేమో?

సాయంత్రమయ్యిందా... ఏమో? నాకెప్పుడూ చీకటే... సాయంత్రమయి నట్టుంది. అమ్మ మనసు పలవరిస్తోంది... అమితాష్... అమితాష్ అంటూ

నాన్న పేరు అమితాషా??

మరి అమ్మెందుకు ఏడ్చినట్టు... నేను చచ్చిపోయి పుడ్తాననా??

లేదమ్మా బయటికి రాగానే నిన్ను ముద్దాడుతాను తెలుసా?

అమ్మ మౌనంగా వుండిపోయి ఎన్ని గంటలయిందో... నాన్న మీద కోపమేమో?

అయ్యో... ఏమిటే... ఏం జరుగుతోంది... అమ్మ కంఠనాళాలు బిగుసుకు పోతున్నాయే... అమ్మ దేనినో తన్నేసింది... గాలిలో వూగుతోందా అమ్మ... నాకూ ఊయల ఊగుతున్నట్టుగా వుంది కాని... అదిగో రక్తప్రసారం విశృంఖలమై పోతుంది... గుండె కవాటాలు చప్పుడు తగ్గుతోంది. నాక్కూడా ఊపిరాడడం లేదు.

బయట ఎవరో ఏదో చప్పుడు చేస్తున్నారు. బాదుతున్నారు. అమ్మ ఇంకా గాల్లో వూగుతున్నట్టుగానే వుంది. అమ్మనించి శ్వాసరాక ఊపిరితిత్తులు ముడుచుకొస్తున్నాయి.

అమ్మా... అమ్మా... మాట్లాడమ్మా ... నేను అరచి గీపెట్టినా ఎవరికీ విన్పించదే?

పెద్ద శబ్దంతో ఏదో విరిగిన చప్పుడు!

గబగబా వచ్చి అమ్మ చుట్టూ మూగారేమో? ఏవరో మొత్తుకుంటున్నారు... ఏడుస్తున్నారు. తిట్టుకుంటున్నారు. పది నిమిషాలు సాగిన గందరగోళం తర్వాత అమ్మ శ్వాసనాళం లోంచి వచ్చిన గాలి చల్లగా తగిలి గుండె జలదరించింది. కవాటాలు మృదంగాలై మ్రోగాయి. నాక్కూడా బలమొచ్చి నట్టుగా వుంది.

"పిచ్చి తల్లి! ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించిందో" ఎవరో అన్న మాటకు నాకు లీలగా అర్థమైంది. అమ్మకు స్పృహ వచ్చినట్టుగా వుంది. ఏడుస్తూనే వుంది. క్షణం తర్వాత నా గుండెల మీద గట్టిగా ఎవరో గుద్దారు...

"నాకు వీడొద్దు... నాకు వీడొద్దు" అమ్మే అరుస్తున్నట్టుగా వుంది. అమ్మ పిడికిళ్లతో తన కడుపు మీద గుద్దుకుంటుంది. ఆ పిడిగుద్దులు నా గుండెల మీద, కడుపు మీద తాకి ప్రాణాలు పోతున్నాయి.

"అమ్మా నన్నెందుకు చంపాలనుకుంటున్నావ్..." అని అమ్మ కడుపులోనే ఏడ్చాను ఏడుస్తున్నాను

నీరసపడిపోయిన అమ్మను ఈ రాత్రికి రాత్రే ఎటో తరలిస్తున్నారు. ఏం జరుగుతుందో బయటి ప్రపంచంలో ఏడుస్తున్నారు తిట్టుకుంటున్నారు, ఓదార్చుకుంటున్నారు, ఎవరు వాళ్లంతా! అమ్మ మళ్లీ నన్ను ఆర్తిగా నిమిరి, అపారంగా ఏడ్చింది. అమ్మ చేష్టలు నాకేం అర్థం కాలేదు.

ఎక్కడికో ప్రయాణమయ్యాక, ఎవరో నన్ను నాలుగు దిక్కులా నొక్కి రేపు తప్పకుండా డెలివరీ అవుతుందనే మాట చెప్పి పోయారు.

అమ్మ గుండె వేగం పెరుగుతోంది నా రాక కోసం.

నరాలు ప్రకంపనాలై రక్తపోటు పెరుగుతుంటే... నేను కదిలాను. అమ్మ అరచింది. నడుమును పట్టుకొని నాలుగు దిక్కులా వంగిపోతుంటే... విజయగర్వంతో కదిలాను.

అమ్మ గర్భాన్ని ఛేదించుకొని వచ్చిన మరు క్షణమే బొడ్డు ప్రేగు తెంపుకున్న నేను అమ్మ నడిగింది ఒకే ఒక్క ప్రశ్న

"అమ్మ నన్నెందుకు చంపాలనుకున్నావ్?" అప్పటికీ అమ్మ నుదుటి మీద స్వేద బిందువులు మెరుస్తున్నాయి. అమ్మ కళ్లు వర్షిస్తున్నాయి.

"చెప్పమ్మా... నన్నెందుకు చంపాలనుకుంటున్నావు" మంచు ఖండాలన్నీ కదిలి, వచ్చి కన్నీరై నా చుట్టూ వున్న రక్తాన్ని కడిగేస్తూ రోదిస్తూ చెప్పింది.

"నా కింకా పెళ్ళి కాలేదు నాన్నా..." అమ్మ గొంతు వణికింది. నీకు పెళ్లి కాకపోతే నేను రాకూడ..." నా మాట గొంతులోనే ఆగిపోయింది. అమ్మ బలమైన చేతులు నా మెడచుట్టూ బిగుసుకుంటున్నాయి.

అమ్మ... అమ్మ నాకు... ఊపిరా.... డడం లేద వ్ వ్ వ్..."

●